ఆడపిల్ల తండ్రి

తిరుమలశ్రీ

రాగ రంజితమయిన ప్రియురాలి వదనంలా అరుణిమ దాల్చుకుంటోంది సాయం సంధ్య.

నీలి నీడల మేలి ముసుగును సవరించుకుంటోంది ప్రకృతి కాంత.

పార్కులోని అందమైన తరులతాదులు వృద్ధ భాస్కరునికి వీడ్కోలు చెబుతూ నిశాకాంతకు స్వాగతం పలికేందుకు సన్నద్ధమవుతున్నాయి

చీకటికి నాందిగా పార్కులో దీపాలు వెలిగాయి

మర్రి చెట్టు క్రింద వున్న సిమెంట్ బెంచి మీద కూర్చున్న నరహరి ప్రకృతి అందాలను ఆస్వాదించడంలేదు. ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయి వున్నాడు

అతని ఆలోచన ఎప్పుడూ ఒక్కటే!

తెగని గొలుసులాంటిది అది

జయంతి పెళ్ళి. !

అహర్నిశలూ అతని బుర్రను దొలిచే ఆలోచన అదే

రోజు రోజుకూ గుమ్మంలా ఎదిగిపోతూన్న జయంతిని చూస్తుంటే దోషిలా ఫీలవుతుంటాడు అతను.

జయంతికి అందం వుంది.

జయంతికి వయసు వుంది.

జయంతికి చదువుంది

లేనిదల్లా డబ్బు ఒక్కటే'

అది కూడా జయంతికి కాదు- నరహరికి'

నరహరి ఎవరో కాదు

జయంతి తండ్రి

కట్నాల పరుగు పందెంలో కొంత దూరమైనా పరుగెత్తలేని నిస్సహాయుడు అతను.

కడుపు కట్టుకుని కూతుర్ని చదివించాడు.

కూతురి అందం చూసి మురిసిపోయాడు.

తెలివి తేటలకు పొంగిపోయాడు

అయితే, అందం చూసి చేసుకునే రోజులు ఇంకా రాలేదన్న సత్యాన్ని మాత్రం విస్మరించాడు

ఆడపిల్ల గుణ గణాలు కట్నం ముందు-సూర్యుడి ముందు దివిటీల వంటివన్న నగ్న సత్యం గుర్తించలేకపోయాడు

ఆడపిల్లకు పెళ్ళి చేయలేని ఓ అసమర్థుడిలా మిగిలిపోయాడు

అసమర్థులందరిలాగే తానూ ఎస్కేపిజం అలవరచుకుంటున్నాడు

ఇంటి పట్టున వుండి కూతురి ముఖం చూల్లేక ఎప్పుడూ వూరు పట్టుకుని తిరగడం అలవాటు చేసుకున్నాడు

సాయంకాలం కాసిని టీ నీళ్ళు గొంతుకలో పోసుకుని పబ్లిక్ పార్క్‌కి చేరుకోవడం అతని దిన చర్య అయింది.

పార్కులో ఓ-బెంచి మీద కూర్చుని వచ్చే పోయే వారిని చూస్తూ తన ఆలోచనలను మరచిపోవడానికి ప్రయత్నిస్తూ వుంటాడు నరహరి

కాని, కన్నుల ముందు కన్నుల పండువుగా తిరిగే యువ జంటలను చూస్తుంటే ఎదలోని పుండు రేగుతూనే వుంటుంది. జయంతిని వారితో పోల్చుకుని బాధ పడుతూ వుంటాడు.

కనిపించిన వారితో కబుర్లలోకి దిగుతాడు అతను. ఆలోచనలను దూరంగా వుంచేందుకని ఒంటరిగా వుంటే మెదడంతా దొలిచేస్తూ వుంటాయి అవి చెద పురుగుల్లా.

చీకట్లు దట్టంగా క్రమ్ముకోవడంతో చిన్నగా నిట్టూర్చి పైకి లేచాడు నరహరి. ఇంటికి వెళ్ళేందుకని.

అతని నిట్టూర్పుకు కారణం ఇదమిద్ధమని చెప్పడం కష్టం. ఏదైనా కావచ్చును.

జీవన గమనంలో మరో రోజు నిష్ప్రయోజనంగా గడిచిపోయిందన్న నిస్పృహ కావచ్చును.

ఎంతసేపు కూర్చున్నా ఇంటికి వెళ్ళక తప్పదన్న భావన కావచ్చును.

కూతురి ముఖం చూడడం ఎలాగా అన్న బెంగ కావచ్చును.

లేదా- ఆ రోజు కూడా మూర్తి జాడ లేదన్న అసంతృప్తి కావచ్చును.

మూర్తి వారం రోజులుగా కనిపించనందుకు నరహరి అసంతృప్తికి, అశాంతికి గురి కావడంలో ఆశ్చర్యం లేదు.

అలాగని మూర్తి అతనికేదో అవుతాడనుకుంటే పొరపాటే'

మూర్తి నరహరికి ఏమి కాడు.

కాని, రోజూ పార్కులో అతనికి ఎదురవుతాడు'

మూడు నెలలుగా ఒకరి కొకరు సన్నిహితంగా వచ్చారంటే- అందుకు కారణం ఇద్దరూ బాధాతప్త హృదయులు కావడమే!

సుఖాలకంటె మనుషుల్ని కష్టాలే మరింత దగ్గరకు చేరుస్తాయంటే అతిశయోక్తి కాదేమో!

సమస్యలు వేరు కావచ్చును

దారులు భిన్నం కావచ్చును.

కాని, కష్టం అందరిదీ ఒకటే'

ఒకరి బాధను మరొకరికి చెప్పుకున్నట్టయితే హృదయం తేలికపడుతుందంటారు. పైగా తమ బాధల్ని ఇతరులకు చెప్పుకోవడమూ, పరుల కష్టాలను తెలుసుకుని వాటిలో పాలు పంచుకోవడమూ వయసు వుడిగిన వారిలో పరిపాటి.

నరహరి, మూర్తిలది అటువంటి పరిచయమే.

అలాగని మూర్తి కూడా నరహరిలాగే ముసలివాడనుకుంటే పప్పులో అడుగు వేసినట్టే!

మూర్తి వయసు పాతికపైన ఒకటో, అరో వుండవచ్చును

తనకు రెట్టింపు వయసు వున్న నరహరితో అతనికి స్నేహం ఏమిటన్న ఆశ్చర్యార్థకం చూపరుల బుర్రల్లో పెద్దగా నిలుచొవచ్చును.

అందులో వింత ఏమి లేదు.

ప్రత్యేకత అసలే లేదు

ఒంటరితనానికి దూరంగా పారిపోయేందుకని కనిపించిన వారందరితోనూ కబుర్లు కలిపే నరహరికి, మూణ్నెల్ల క్రితం పార్కులో మూర్తితో పరిచయమయింది

సన్నగా, పొడవుగా, చామనచాయ రంగులో వుంటాడు మూర్తి. ముఖం మీద పడే వంకీల జుత్తు, చిరు నవ్వులొలికే పెదవులు- చూడగానే సదభిప్రాయం ఏర్పడేలా వుంటాడు నీటుగా డ్రెస్ చేసుకోవడం అతనికి అలవాటు. లైట్ బ్లూ కలర్ స్కూటర్ మీద వస్తుంటాడు పార్కుకి.

బి.కామ్. పాసయిన మూర్తి ఓ నేషనల్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. పెద్దగా కుటుంబ సమస్యలేవీ లేవు. ఓ తల్లి, చెల్లాయి తప్ప వేరెవ్వరూ లేరు అతనికి. ఏడాది క్రితమే చెల్లెలికి పెళ్ళయిపోయింది. ప్రస్తుతం అతనికి పెళ్ళికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కొద్ది రోజులుగా మూర్తి ఎందుకో దిగులుగా వున్నట్టు గుర్తించిన నరహరి ఆరా తీసాడు

అంత చక్కటి వుద్యోగం చేసుకుంటూ, దర్జా జీవితం గడుపుతూన్న ఆ కుర్రాడికి అంత దిగులు ఏమిటో బోధపడక ఆశ్చర్యపోయాడు నరహరి. అదేదో ప్రేమ గాథ కాదుగదా అనిపించింది. ఆ విషయమే అడిగేశాడు అతన్ని.

పరిచయమయినప్పటి నుంచి నరహరిపైన సదభిప్రాయం కలిగింది మూర్తికి. పైగా వయసులో పెద్దవాడు తన మీద శ్రద్ధాసక్తులతో అనునయంగా అడిగేసరికి నిజం దాచాలనిపించలేదు. తన సమస్య ఏమిటో చెబితే అనుభవాలతో తల పండిన ఆ పెద్దాయన ఏదైనా పరిష్కార మార్గాన్ని సూచించకపోతాడా అన్న ఆశ కూడా కలిగింది

అందుకే తనను పీడిస్తున్న సమస్యను ఆయన ముందు పరిచాడు మూర్తి.

అది విని నరహరి పెద్దగా ఆశ్చర్యపోలేదు. కారణం- అటువంటి సమస్యలు ఈ కాలంలో దాదాపు కుర్రకారు అంతటినీ పట్టి పీడిస్తున్నవే!

మూర్తి ఓ అమ్మాయిని ప్రేమించాడు ఆ అమ్మాయి ఓ వున్నత కులానికి చెందినది తాను ఓ వెనుకబడిన జాతికి చెందినవాడు ఆర్థికంగా అన్ని

విధాలా వున్నత స్థాయిలో వున్నాడు తాను. ఆ విషయంలో ఆ అమ్మాయి మాత్రం వెనుకబడే వుంది.

అయినా కులాల అంతరం, తమ అగాధాలను సృష్టించింది. వాటిని అధిగమించాలంటే అసాధ్యంగా కనిపిస్తోంది. కారణం- ఆ అమ్మాయి తండ్రి కూటికి పేదవా డయినా, కులానికి ప్రాముఖ్యత నిచ్చేవాడు. తమ పెళ్ళికి వొప్పుకోడేమోనన్న భయం.

ఏడాది క్రితం టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆ అమ్మాయితో పరిచయమయింది మూర్తికి. తొలి చూపులోనే ఒకరి నొకరు ఆకర్షించుకోవడం జరిగింది. ఆ తరువాత తరచు ఏదో చోట కలుసుకుంటూనే వున్నారు వాళ్ళు. ఆ అమ్మాయి అందము, అణుకువ, హద్దుల్లో నడుచుకునే ఆమె తీరూ ఎంతో నచ్చాయి మూర్తికి. పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలన్న నిశ్చయానికి వచ్చేసాడు. తండ్రి అనుమతి లేనిదే తమ వివాహం అసంభవమంటోంది- ఆ అమ్మాయి. కాని, ఆమె తండ్రిని అడిగేదెలా? పిల్లి మెడలో గంట కట్టేది ఎలాగో తెలియక బాధ పడుతోంది ఆ యువ జంట.

మూర్తి చెప్పిన వివరాలు ఆలకించడంతో విస్తుపోయాడు నరహరి.

"చెప్పండి, మాష్టారూ! ఈ ఇరవైయొకటో శతాబ్దంలో కూడా కులమతాల పట్టింపులతో యువ హృదయాలను విడదీయడం సమంజసమంటారా?" అంటూ మూర్తి ఆవేశంతో ప్రశ్నిస్తూంటే- ఏం జవాబు ఇవ్వాలో తోచలేదు నర హరికి.

కారణం- తనకూ అటువంటి పట్టింపులు వున్నాయి. కాని, మూర్తివంటి వరుడు కట్నం లేకుండా లభించినట్లయితే కులం, మతం అంటూ తాను ఆ అవకాశాన్ని వదులుకుంటాడా అన్నది ఆలోచించవలసిన విషయమే!

"ఆ అమ్మాయి వుండేదెక్కడ? ఆమె తండ్రి ఏం చేస్తూ వుంటాడ?" అంటూ ప్రశ్నించాడు నరహరి.

"ఆయన బడి పంతులుగా పని చేసి ఏడాది క్రితమే రిటైరయ్యాడట. వాళ్ల ఇల్లు దేవాలయిం వీధిలో వుంది" అన్నాడు మూర్తి.

ఉలిక్కిపడ్డాడు నరహరి.

"దేవాలయం వీధిలో... బడి పంతులా!?" తెల్లబోయాడు.

"ఔన్సార్. ఆయన మీకు తెలుసా?" అడిగాడు మూర్తి ఆతృతగా, ఆయన అడిగిన తీరు చూసి.

"ఆ అమ్మాయి పేరేమిటన్నావ్?"

"జయ... తెల్లగా, అందంగా వుంటుంది."

నరహరి గుండె ఓ బీట్‌ని మిస్ చేసింది.

"దేవాలయం వీధిలో వాళ్ల ఇల్లు ఎక్కడుందో తెలుసా?" ఆతృతను అతి కష్టం మీద అణుచుకుంటూ ప్రశ్నించాడు అతను.

"వీధి చివర బొప్పాయి చెట్టున్న పాత పెంకుటిల్లు..." హఠాత్తుగా గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది నరహరికి.

"అమ్మా!" అంటూ గుండె పట్టుకున్నాడు.

చెబుతున్నది ఆపి నరహరి వంక చూసాడు మూర్తి.

"మాష్టారూ!" అన్నాడు కంగారుగా.

గుండె పైన చేత్తో రాచుకుంటూ వెనక్కి జారబడిపోయాడు నరహరి.

"ఏమయింది, మాష్టారూ? ఇంత హఠాత్తుగా ఎందుకలా అయిపోయారు? గుండె నొప్పా?" అంటూ ఆతృతతో ప్రశ్నల వర్షం కురిపించాడు మూర్తి.

"ఎందుకో గుండెల్లో సన్నగా పోటు

మొదలయింది బాబూ! ఇవాళ్టికి ఇంటికి వెళ్లిపోతాను" అంటూ లేచాడు నరహరి.

"నన్ను కూడా రమ్మంటారా?" అడిగాడు మూర్తి.

"ఒద్దొద్దు." అన్నాడు నరహరి కంగారుగా. "ఇంటికి వెళ్లి పడుకుంటే అదే సర్దుకుంటుంది."

అతను వారిస్తున్నా వినకుండా రిక్షాను పిలిచి ఎక్కించాడు మూర్తి. రిక్షా వాడికి డబ్బులు తానే ఇచ్చేసాడు.

ఆ రాత్రి ఇంటికి నరహరి వచ్చాడేగాని మనసు మనసులో లేదు. గుండెలో పోటు సర్దుకున్నా, మనసు మాత్రం సర్దుకోలేకపోతోంది. ఆలకించిన కొత్త విషయాన్ని ఆకళింపు చేసుకోలేకపోతోంది.

"అదోలా వున్నారేమిటి? వొంట్లో బావుండలేదా?" అని భార్య పరామర్శించితే, "ఏం లేదు" అన్నాడు ముక్తసరిగా.

మూర్తి పలుకులే అతని మదిలో మెదలుతున్నాయి

'ఆ అమ్మాయి పేరు జయ . తెల్లగా, అందంగా వుంటుంది. దేవాలయం వీధిలో చివర... బొప్పాయి చెట్లున్న.. పాత పెంకుటిల్లు-వాళ్లది... ఆమె తండ్రి రిటైర్డైన బడి పంతులు .'

ఇంటిలో తిరుగుతూన్న కూతురు వంక దొంగ చూపులు చూసాడు నరహరి.

ఆ చూపులు కొత్తగా వున్నాయి.

జయంతి ..!

అమాయకంగా కనిపించే తన కూతురు...

తనకు తెలియకుండానే ప్రేమలో పడిందా!?

రోజూ ఎవరో స్నేహితురాలిఇంటికి వెళ్ళొస్తున్నానంటే నిజమే కాబోలు అనుకుంటున్నాడు తను. ఆవంకతో రోజూ మూర్తిని ఎక్కడో కలుసుకుంటోదన్న విషయం తనకేం తెలుసు!?

ఏమి ఎరుగని దానిలా ఎంత అమాయకంగా కనిపిస్తోంది!

తన ప్రేమకు తాను అడ్డుగా వున్నాడని జయంతి బాధ పడుతోందా?

తన భవిష్యత్తుకు భూతంలా అడ్డు నిలుస్తున్నాడనుకుంటోందా?

తన ప్రేమను ఇటు నాతో చెప్పుకోలేకా, అటు వదులుకోనూ లేకా తనలో తానే సతమతమవుతోందా?

హఠాత్తుగా అనిపించింది నరహరికి-కొన్నాళ్ళుగా జయంతిలో ఏదో మార్పు వచ్చిందని. ఎప్పుడూ హుషారుగా, చలాకీగా వుండే పిల్ల- ఆ మధ్య మౌనంగా, గంభీరంగా వుంటున్నట్లు అనిపించింది.

"భోజనానికి లే, నాన్నా!" అని కూతురు పిలవడంతో గాఢంగానిట్టూర్చి లేచాడు నరహరి.

ఆడపిల్ల తండ్రి

ఆ తరువాత దాదాపు ప్రతి రోజూ నరహరి, మూర్తి పార్కులో కలుసుకుంటూనే వున్నారు.

తన ప్రేమను గూర్చి కొత్త కొత్త విశేషాలను ఎప్పటికప్పుడు నరహరి చెవిన వేస్తూనే వున్నాడు మూర్తి.

'తాను ప్రేమిస్తున్నది నా కూతుర్నేనన్న విషయం ఎరుగడు పాపం!' అనుకున్నాడు నరహరి మనసులో

ఇప్పుడు నరహరి పని ద్వైదియంలో పడింది.. కూతురికి కులాంతరపు వివాహం చేసినట్లయితే సాటి కులుపు వాళ్ళు వెలి వేస్తారేమోనన్న భయం ఒక వంక... మరో వంక- కూతురి భవిష్యత్తుకు ప్రతిబంధకం కావడం ఇష్టం లేదు . మానసికంగా సతమతమవుతున్నాడు నరహరి.

జయంతి వయసుకూ. అందానికీ. తెలివి తేటలకు తగిన వరుణ్ని, సాటి కులపోణ్ని తేలేడు తాను. కులపు కోతిని తేవాలన్న కట్నం కావాలి!

జయంతిని ఏ అనామకుడికో ఇచ్చి కట్టబెట్టనూ లేదు. మనస్ఫూర్తిగా ప్రేమించుతూన్న మూర్తికి ఇచ్చి వివాహం జరిపించడంకంటే మంచి పనిని తన జన్మలో చేయలేడు. ఆ జన్మలో అంతటి మంచి సంబంధాన్ని తీసుకురాగలనిని కలలో కూడా ఆశించలేడు కులాన్ని నమ్ముకున్నందువలన తనకు వొరిగేదేమి లేదు. అలాగని కూతురిని కులాంతరపు వివాహం చేసే తెగింపూ లేదు తనకు.

అతని హృదయాంతరాలలో జయంతి, మూర్తిని చేసుకోవడం అతనికి ఇష్టమే. కాకుంటే, ఆ విషయాన్ని బహిరంగంగా వొప్పుకోలేడంతే! అందుకే లోలోపల, వారి ప్రేమ సఫలం కావాలని, తనకు తెలియకుండానే వాంఛిస్తున్నాడు, ఆశీర్వదిస్తున్నాడు... అందుకే మూర్తిని డిస్కరేజ్ చేయలేదు అతను. కూతుర్ని మందలించనూలేదు

ఎప్పటికప్పుడు వారి ప్రేమ ఎంత వరకు వచ్చినది ఆత్రుతతో తెలుసుకుంటూనే వున్నాడు.

అతని ఆరాటం చూచాయగా గమనించిన మూర్తి ఓసారి, "జయ కుటుంబం మీకు తెలుసా, మాస్టారూ?" అని అడిగాడు

నరహరి తడబడి, "తెలిసినట్లే వుంది" అని తప్పించుకున్నాడు

మరో రోజున, "ఇలా ఎన్నాళ్లని బాధ పడేది, మాస్టారూ! మా ఇంట్లో నా పెళ్లికి తొందర చేస్తున్నారు జయను తప్ప ఇంకెవరినీ పెళ్లాడదలచుకోలేదు నేను. జయ తండ్రికి చెప్పి వొప్పించే ధైర్యం మా ఇద్దరికీ ఎలాగూ లేదు... ఇద్దరమూ ఎక్కడికైనా వెళ్లిపోయి గుళ్లో పెళ్లి చేసుకోవాలనిపిస్తోంది నాకు. అందుకు జయ వొప్పుకోవడం లేదు. తండ్రికి తల వొంపులు తెచ్చే పని తాను చేయనంటోంది.. ఇక ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తోచడం లేదు, మాష్టారూ!" అంటూ వాపోయాడు మూర్తి

అది వింటూనే కూతురి విజ్ఞతకు లోలోపలే అభినందించాడు నరహరి. 'ఎంతైనా నా కూతురు!' అనుకున్నాడు గర్వంగా

"అమ్మాయి చెప్పింది సబబుగానే అనిపిస్తోంది మరి," అనడం మినహా ఇంకేమీ అనలేకపోయాడు.

"మాష్టారూ! జయ తండ్రి మీకు తెలుసేమోనని పిస్తోంది నాకు. దయ చేసి ఆయన మా పెళ్లికి అంగీకరించేలా చేయలేరూ? ప్లీజ్!" అన్నాడు మూర్తి నరహరి చేతులుపట్టుకుని.

"ఆయనతో నాకు పెద్దగా పరిచయం లేదు. అయినా ప్రయత్నిస్తాలే" అనగలిగాడంతే నరహరి, నిజం చెప్పడానికి ధైర్యం చాలక.

'తన మేకపోతు గాంభీర్యం చూసి భయపడు తున్నారు వాళ్ళు. వాళ్ళు ధైర్యం చేస్తే తాను. కాదనలేదన్న సంగతి వాళ్లకెలా తెలుస్తుంది!' అనుకున్నాడు మనసులో

అది జరిగి వారం రోజులయింది.

ఆ తరువాత ఏ కారణం చేతనో మూర్తి మళ్ళీ కనిపించలేదు నరహరికి. ఎంచేతో పార్కుకి రావడం లేదు అతను. ఏదైనా పని మీద ఏ వూరికైనా వెళ్లాడో, లేక జబ్బు పడి మంచం ఎక్కాడో తెలియక కొద్దిగా కలవరపడ్డాడు. ఇంట్లో కూతుర్ని జాగ్రత్తగా గమనించసాగాడు. ఏ మాత్రం అనుమానాస్పదంగా లేదు ఆమె ప్రవర్తన. 'ఎంతయినా జయంతి తెలివయినది. అంత సులభంగా బయటపడదు' అనుకున్నాడు.

ఎప్పటిలాగే ఆ వారం రోజుల్లోనూ స్నేహితురాలి ఇంటికని జయంతి వెళ్లి వస్తూనే వుంది. కనుక మూర్తి వూర్లోనే వుండి వుండాలి అనుకున్నాడు నరహరి. అయితే అతను పార్కుకు ఎందుకు రావడం లేదో బోధపడలేదు... 'కొంప దీసి తానెవరో ఆ కుర్రాడికి తెలిసిపోలేదుగదా!' అనిపించింది.

ఆ మధ్య నరహరిలో అంతర్మథనం అధిక మయింది. కూతురి సుఖం కోసం తన పరువు ప్రతిష్టలకు తిలోదకాలు వదులుకుందామా అనిపించసాగింది... మూర్తి పిల్లను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడు. అతన్ని చేసుకున్నట్లయితే



జీవితాంతమూ సుఖపడుతుంది. కట్నాలు ఇవ్వ గలిగే స్థితిలో లేదు తాను. ఎంత కట్నం పోసినా మూర్తి వంటి సంబంధం తేవడమూ అసాధ్యమే.... ఇలా సాగిపోతున్నాయి అతని ఆలోచనలు. అలాగని బహిరంగంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి ధైర్యం చాలడం లేదు.

మూర్తి కోసం ఎదురు చూస్తూంటే ఆ మధ్య అవే ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి అతని మదిలో.

ఆ వ్యవహారాన్ని గూర్చి జయంతిని అడిగివేద్దామా అనిపించేది ఒక్కోసారి. బలవంతంపైన ఆ ఆలోచనకు స్వస్తి చెప్పే వాడు.

తానొక ఆడపిల్ల తండ్రి. కట్నం లేకుండా తన కూతుర్ని పెళ్ళి చేసుకుంటాననీ. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాననీ, అన్ని విధాలా అర్హుడైన ఓ యువకుడు ముందుకు వస్తే- కాదనడం అవివేకమే అవుతుంది. కుల మతాలు తన కూతురి జీవితాన్ని బంగారుమయం చేయలేవు. తనకూ మంచి చెయ్యా లేవు. కనుక ఆ అవకాశాన్ని వినియోగించుకోవడం వుత్తమం. కాలదన్నుకోవడం మూర్ఖత్వం అవుతుంది.

ఇద్దరిలో ఎవరు కదిపినా 'ఓ.కే.' అనేద్దామని చూస్తున్నాడు అతను. తనంతట తానుగా చెప్ప డానికి మనస్కరించడం లేదు. భేషజం అడ్డు వస్తోంది.

ఆ రోజు కూడా బాగా ప్రొద్దెక్కేంత వరకూ మూర్తి కోసం ఎదురు చూసి. నిరాశతో ఇంటి ముఖం పట్టాడు నరహరి

అయితే, పార్కు గేటు దగ్గరకు వచ్చేసరికి హడావుడిగా వస్తూ ఎదురుపడ్డాడు మూర్తి.

"మాష్టారూ!" అంటూ పిలిచాడు.

అతను ఎందుకో హుషారుగా కనిపించాడు.

అతన్ని చూడడంతో పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది నరహరికి

"ఇన్ని రోజులుగా కనిపించకపోతే మనసు పరి పరి విధాలుగా పోయింది. ఏమయింది బాబూ!" అంటూ పలుకరించాడు ఆప్యాయంగా.

"రండి మాష్టారూ! ఓ పది నిముషాలు కూర్చుని వెళ్ళిపోదాం" అంటూ పార్కు లోపలికి దారి తీసాడు మూర్తి. "ఈ శుభ వార్త చెవిని వేయాలనే వచ్చాను "

గుండె గతుక్కుమంది నరహరికి. 'కొంపదీసి వేరే ఏ పిల్లతోనయినా ఇతని పెళ్ళి కుదరలేదు గదా! విసుగెత్తి పెద్దల వొత్తిడికి లొంగిపోయాడేమో. పెద్దలు చూసిన పిల్లను పెళ్ళాడుతున్నాడేమో! ఏ వూళ్ళనో పెళ్ళి చూపులకువెళ్ళడం మూలానే ఇన్నాళ్ళూ రాలేదేమో!' అనుకున్నాడు.

మూర్తి చెప్పబోయే దాని కోసం అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

"మాష్టారూ! ఈ వారం రోజులూ నేను కనిపించక పోవడానికి కారణం ఏమిటో తెలుసా? మా హెడ్డాఫీసుకి వెళ్ళాను, బదిలీ కోసం ప్రయత్నించేందుకు..."

అక్షరసాగర మథనం

పుంఖాను పుంఖాలుగా
రాసేస్తున్నారు
అక్షరాల సాగరాన్ని
మథనం చేస్తూ -
ఒక వయిపు
కవితాసురులూ
ఇంకొక వయిపు
నవ్య కవిశూరులు-
ఒక వయిపు
క్షుద్ర కవి పుంగవులు
ఇంకొక వయిపు
చేతబడుల సాహితీవేత్తలు
అక్షరాల సాగరమథనం చేస్తూ -
ఈ మథనంతో
అశ్రు కవితలు
ఆశుకవితలు
అపహాస్య కవితలు
అసభ్యపు రాతలు
పుట్టుకొస్తున్నాయ్-
అక్షర మథనం జరుగుతే
అభ్యుదయ కవిత్వం
ఆచరణ సాహిత్యం
ఆమగువారి ఆక్రందనల
ఆవేశాల అక్షర రూపం
పుట్టాలి-
అందరూ రసాస్వాదనం
చేయాలి
లెకుంటే
ఆశయం 'పూజ్యం'
ఇతివృత్తం "పెద్ద వృత్తం"-

-అస్రాని

ఆడపిల్ల తండ్రి

"బదిలీయా! ఎందుకూ?" అన్నాడు నరహరి నీరసంగా.

"ఎలాగైతేనేం జయను వొప్పించగలిగాను. మాష్టారూ! నాతో వచ్చేయడానికి అంగీకరించింది. అయితే వున్న వూళ్ళోనే వుండడం ఇష్టం లేక మా హెడ్డాఫీసుకి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాను..." ఉత్సాహంగా చెప్పుకుపోయాడు మూర్తి. "మాష్టారూ! జయా, నేనూ రేపు రాత్రికే వెళ్ళి పోవడానికి నిశ్చయించుకున్నాము. తిన్నగా తిరుపతి వెళ్ళి ఏడుకొండలవాడి ముందు పెళ్ళాడుతాము. అటు నుంచి అటే కొత్త వూరికి వెళ్ళి డ్యూటీలో జాయినయిపోతాను..."

"అలాగా!" అన్నాడు నరహరి సంభ్రమంతో. ఎదురు చూడని ఆ వార్త హఠాత్తుగా ఆలకించ డంతో అతనిలో మిశ్రమ భావాలు చోటు చేసుకున్నాయి.

"మాష్టారూ! తరువాత విషయం నెమ్మది మీద జయ తండ్రికి తెలియపరుస్తాము. ఆయన వొప్పుకున్నట్లయితే తిరిగి వచ్చి ఆయన ఆశీర్వాదం పొందుతాము" అన్నాడు మూర్తి "మొదటి నుంచి నా మీద అభిమానం చూపుతున్న మీకు ఈ శుభవార్త చెవిన వేస్తే సంతోషించి, మమ్మల్ని ఆశీర్వదిస్తారని వచ్చాను."

"శుభం! ఆ ఏడుకొండల వాడు మీకు అండ దండలుగా వుంటాడు, బాబూ!" అంటూ మన స్ఫూర్తిగా ఆశీర్వదించాడు నరహరి.

జయంతికి తగిన వరుడు లభిస్తున్నందుకూ, కోరుకున్న వాడితో మనువు జరుగబోతున్నందుకూ ఎంతో సంతోషంగా వున్నది అతనికి.

కాని, మనసులో ఏమూలో కలుక్కుమనక పోలేదు. తన కన్న కూతురు తనకు చెప్పకుండానే ప్రియుడితో లేచిపోతోంటే, నలుగురూ నాలుగు విధాలుగా ఆడిపోసుకుంటారే అన్న బాధ కలిగింది. లోకుల ఎత్తి పొడుపుల్ని తాను భరించ గలడా అన్న బెంగ కూడా కలిగింది.

నలుగురిలా స్వగృహంలో పందిట్లో పెళ్ళి చేసుకునేందుకు నోచుకోలేక పోయిందే, కూతురి పెళ్ళి తన చేతుల మీదుగా చేయలేక పోతున్నానే అన్న అసంతృప్తి కూడా మదిలో దొలుస్తోంది.

అంతలోనే, "కులపువాళ్ళను కాదని తన చేతులు మీదుగా ఆ పెళ్ళి చేయగల సాహసం తనకు వున్నదా? వాళ్ళు అలా పరాయిచోట పెళ్ళి చేసుకుని రావడమే మంచిది ప్రస్తుతానికి. ఆ తరువాత అన్నీ వాటంతటవే సర్దుకుంటాయి" అని తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు.

ఆ రాత్రంతా అన్యమనస్కంగానే వున్నాడు నరహరి. కూతురిని చాటుగా పట్టి పట్టి చూడ సాగాడు. మామూలుగానే కనిపించింది జయంతి. ఆ పిల్ల వదనంలో ఎటువంటి భావాలూ కనిపించ లేదు.

మూర్తి తన ప్రియురాలితో లేచిపోయే రోజున-

"క్షమించు తల్లీ! ఈ దేశంలోని ఓ ఆడపిల్ల తండ్రిని నేను! నీ సుఖం కోరి నిన్ను వొంటరిగా వెళ్ళ నిస్తున్నాను. మూర్తి బుద్ధిమంతుడు. నిన్ను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడు అతని జతలో నీ జీవితం సౌఖ్యవంత మవుతుందన్న విశ్వాసం నాకుంది. అందుకే నిన్ను వెళ్ళ నిస్తున్నాను...." అనుకున్నాడు నరహరి మనసులో, కూతురి వంక మౌనంగా చూస్తూ.

ఆ రోజంతా జయంతి మామూలుగానే వుంది. అతను ఎంత వెదికినా ఎటువంటి తొట్రుపాటూ కనిపించ లేదు ఆమెలో.

కని, పెంచిన తల్లినీ, తండ్రినీ హఠాత్తుగా విడిచిపెట్టి చెప్పకుండా వెళ్ళిపోవలసి వస్తున్నందుకు ఆమె అమితంగా బాధపడు తుందన్న ఆలోచనతో రహస్యంగా ఆమెను గమనిస్తున్న నరహరికి ఆశాభంగమే అయింది. ఆ

పిల్ల మనసులో ఏమి వున్నదో ఏమో, ముఖంలో మాత్రం అటువంటి ఛాయలేవీ గోచరించ లేదు. మామూలుగానే కనిపించింది. ఓ క్షణం చివుక్కు మంది అతని మనసు. అంతలోనే, "పిల్ల గుట్టయినది. తన బాధను లోలోపలే దాచు కుంటుందే తప్ప పైకి తేలదు. పిల్లకు బాధ లేదనుకోవడం పొరపాటు!" అని తన మనసుకు సర్ది చెప్పుకున్నాడు.

ఆ రాత్రి పెందలకడనే భోజనం చేసి త్వరగా పడక ఎక్కాడు నరహరి. అంతేకాదు, నిద్ర పట్టడం లేదంటూ కూతుర్ని అడిగి ఓ నిద్రమాత్ర కూడా వేసుకున్నాడు. ఆ విధంగా రాత్రి ఆమె ఇంటి నుంచి వెళ్ళడానికి తన అడ్డు వుండదన్నట్టు కూతురికి పరోక్షంగా సూచించడమే అతని వుద్దేశ్యం. పడుకునే ముందు తనివిదీరా కూతుర్ని ఓసారి ఆప్యాయాను రాగాలతో చూసుకున్నాడు. తెల్లవారితే మరి కనిపించదు ఆమె! మళ్ళీ ఎప్పటికో చూపుకునేది!

ఉదయం నిద్ర లేచేసరికి కూతురు కనిపించక తన భార్య చేయబోయే రాద్ధాంతాన్ని తలచుకుంటూ కన్ను మూసాడు అతను.

★ ★ ★ ★

రాత్రి నిద్రమాత్ర వేసుకున్నాడేమో, మరునాడు నరహరి నిద్రలేచేసరికి ప్రొద్దెక్కింది.

నిద్ర మంచం మీదనే, "ఏమండోయ్, ఈ చోద్యం అలకించారా?" అంటూ బుగ్గలు నొక్కుకుంటూ వచ్చింది నరహరి భార్య.

అప్పుడు గాని గుర్తుకు రాలేదు అతనికి కూతురు ఆ రాత్రి వెళ్ళిపోయి వుండాలన్న సంగతి.

"ఏమిటే?" అన్నాడు వినబోయే వార్త కోసం గుండెలు బిగబట్టుకుని.

"ఆ శంకరయ్యగారు లేరూ?...." అంటూన్న భార్యతో, "ఏ శంకరయ్యో?" అన్నాడు, ఏదో చెప్పబోయి ఇంకేదో సోది చెబుతోందన్న విసుగుతో.

"అదేనండి. ఈ వీధికి పశ్చిమపు చివర పెంకు టిల్లు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ శంకరయ్యగారు...." అందామె.

"ఏమయిందే ఆయనకు?"

"ఇంకా అయే దేముందండి? అతని పరువు పోతేనూ....!"

"ఆఁ!?"

"ఆయన కూతురు రాత్రి ఎవడితోనో.... కులం కాని వాడితో లేచి పోయిందట.... అవ్వ!" అందామె.

అదిరి పడ్డాడు నరహరి.

"ఏమిటే నువ్వంటున్నది? ఆ అమ్మాయి పేరేమిటి?" కంగారుగా అడిగాడు, నిద్రమత్తు పూర్తిగా వదిలి పోవడంతో.

"ఆ పిల్ల పేరు జయలక్ష్మి. ఎవడ్నో ప్రేమించాను వాణ్ణే పెళ్ళి చేసుకోవడానికి వెళ్ళి పోతున్నాను.. అని ఓ వుత్తరం రాసి పెట్టి వెళ్ళి పోయిందట!...."

భార్య పలుకులతో అతని తల దిమ్మెక్కి పోయింది. "మన జయంతి ఎక్కడ?" అన్నాడు అయోమయంగా.

"నేను జయలక్ష్మి సంగతి చెబుతుంటే, మీరు జయంతి ఎక్కడ అంటా రేమిటండి? అది ఇంట్లోనే వుంది" అంది భార్య మూతి ముడుచుకుంటూ.

"జయంతి ఇంట్లోనే వుందా!?" అన్నాడు అతను అపనమ్మకంగా.

"పిలిచావా, నాన్నా?" అంటూ అక్కడికి వచ్చింది జయంతి.

కూతుర్ని చూడటంతో తెల్లబోయాడు నరహరి. అంతా అయోమయంగా వున్నది అతనికి.

"ఆ పిల్ల పోకళ్ళు చూసి అప్పుడే అనుకున్నాను లెండి, అదెప్పుడో ఇలాంటి అప్రతిష్టపు పని చేస్తుందని!" అంటోంది భార్య.

"మన జయంతి బంగారం!" అంటూ కూతుర్ని దగ్గరకు తీసుకుని అనురాగంతో తల నిమిరిం దామె.

కాని, ఆమె పలుకులు గాని, చేష్టలు గాని నరహరి తలకు ఎక్కడం లేదు.

పొరపాటు ఎక్కడ జరిగిందా అని ఆలోచిస్తుంటే, అసలు విషయం ఆకళింపుకు వచ్చింది అతనికి. తాను ఎంత ఘోరంగా పరాభవం చెందాడో తెలిసి వచ్చింది.

దేవాలయం వీధిలో.... వీధి చివర.... బొప్పాయి చెట్టున్న.... పాడుపడిన పెంకుటిల్లు......

మూర్తి చెప్పింది నిజమే. తానే పొరబడ్డాడు.

వీధిలో ఏ చివర అని తాను అడగలేదు. అడిగితే అతను చెప్పేవాడేమో– పడమటనని!

అది శంకరయ్య గారి ఇల్లు. ఆయనా రిటైర్డ్ బడిపంతులే!

అయితే–

అతను హెడ్‌మాస్టరుగా రిటైరయితే, తాను ఎలిమెంటరి స్కూలు టీచరుగానే రిటైర్ అయ్యాడు.

శంకరయ్య గారిది, తనది వీధి చివరి ఇళ్ళే!

ఆయన ఇల్లు వీధికి పశ్చిమ కొసను వుంటే– తనది తూర్పు దిక్కున చివరి ఇల్లు!

ఇద్దరి ఇళ్ళలోనూ బొప్పాయి చెట్లు వున్నాయి.

ఇద్దరి ఇళ్ళూ ఇంచుమించు ఒకే దశలో వున్నాయి.

అలాగే– శంకరయ్య గారి అమ్మాయి పేరు జయలక్ష్మి.

ఆ విషయం తనకు తెలియదు. మూర్తి "జయ" అంటే జయంతిని అలా పిలుస్తున్నా డనుకుని పొరబడ్డాడు తాను.

శంకరయ్య గారు నిప్పును నీటితో కడిగే నిక్కచ్చి మనిషి. కులం కోసం ప్రాణాలు వదులుతాడు ఆయన.

ఆయన విషయం ఎందుకు గుర్తుకు రాలేదు తనకు?!

మూర్తి చెబుతూన్న వివరాలను తనకు అపాదించుకుని ఎలా మోసపోయాడు?!

తన ఆలోచనలు, ఆశలు తలక్రిందులు కావడంతో తట్టుకోలేక పోయాడు నరహరి. హఠాత్తుగా జబ్బు చేసిన వాడిలా అయిపోయాడు.

"వ్రతం చెడినా ఫలం దక్కలే దన్నట్టు...." అయింది అతని పరిస్థితి.

ఓ ఆడపిల్ల తండ్రిలా.... ఓ సగటు మానవుడిలా.... కూతురికి కట్నం ఇచ్చి పెళ్ళి చేయలేక.... ఆ పిల్ల ప్రేమలో పడితే చాలనుకుని.... మనసుకు నచ్చిన వాడితో ఆమె లేచిపోయినా ఫరవా లేదనుకుని.... కుల గోత్రాలను సయితం పట్టించు కోకుండా.... మనసుతో, పరిస్థితులతో రాజీ పడినందుకు.... ఘోర పరాజయాన్ని పొందాడు నరహరి.

—

చేష్టలు వుడిగి కూతురి వంక అయోమయంగా, వెర్రిగా చూస్తూ వుండిపోయాడు.

అంతరాంతరాలలో అతనింకా మూర్తిని అభినం దిస్తున్నాడో....' అసూయతో శపిస్తున్నాడో.... అతనికే తెలియాలి మరి! □